ప్రజాశక్తి
గురువారం 17 ఆగస్టు 2023 5 విజయనగరం

## శానిటేషన్ కాంట్రాక్టర్‌కు నోటీసులు

### ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-డెంకాడ

'చెరువులో ఆస్పత్రి వ్యర్థాలు' శీర్షికన ఈనెల 14న ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి జిల్లా సర్వజన ఆస్పత్రి సమన్వయాధికారి డాక్టర్ బి.గౌరీశంకర్ స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. భోగాపురం సిహెచ్‌సికు సంబంధించిన వ్యర్థాలను పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించి పంచాయతీకి సంబంధించిన స్థలంలో వేయాలని సూచిస్తూ శానిటేషన్ కాంట్రాక్టర్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యర్థాలను బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వారు తీసుకొని వెళ్తారని, ఆస్పత్రిలో క్లీన్ చేసిన చెత్తను మాత్రమే డంపింగ్‌యార్డులో వేయాల్సి ఉంటుందని తెలిపారు. పంచాయతీకి డంపింగ్‌యార్డు లేకపోవడం వల్ల వ్యర్థాలను సింగవరం చెరువులో వేస్తున్న విషయం వాస్తవమేనని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

## ఇంటింటి సర్వేకు 5 రోజులే గడువు

### నిర్ణీత కాలవ్యవధిలోగా ఓటర్ల జాబితా సవరణ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేకి కేవలం ఐదు రోజులే గడువు ఉందని, ఆ లోగా పని పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఇంటింటి సర్వే పై నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటింటి సర్వేకి ఎక్కువ సమయం లేదని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ ఓటు కల్పించాలని, అనర్హులందరినీ తొలగించాలని ఆదేశించారు. ఓటు తొలగించేటప్పుడు తప్పనిసరిగా ఫారమ్ 7 దరఖాస్తు తీసుకోవాలని, డెత్ సర్టిఫికేట్ లేదా ఏదో ఒక ధవపత్రం కూడా ఉండాలని, వాటిని ఫైల్ చేయాలని సూచించారు. ఒక కుటుంబ ఓట్లు, ఒక అపార్ట్‌మెంట్ లేదా గ్రూప్ హౌస్ ఓట్లు ఒకే పోలింగ్ స్టేషన్లో ఉండేలా రేషనలైజేషన్ చేయాలని చెప్పారు. విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల్లో ప్రక్రియ కొంత నెమ్మదిగా సాగుతోందని, వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎటువంటి తప్పులు లేని, ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు ఎంవి సూర్యకళ, ఎం.అప్పారావు, శేషశైలజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.సుదర్శన దొర, నూకరాజు, పద్మలత, నియోజక వర్గ కేంద్రాల తాశిల్దార్లు, డిటిలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, శ్రీనివాసరెడ్డి, సతీష్‌కుమార్, దయానంద్ పాల్గొన్నారు.

## నత్తనడకన ఇ-క్రాప్

**1.14లక్షల ఎకరాలకు 30శాతమే గుర్తింపు**

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

**జిల్లాలో వ్యవసాయ పంటల ఇ-క్రాప్ బుకింగ్ నత్తనడకన సాగుతోంది. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ పంటలు ఇప్పటి వరకు సుమారు 1.14లక్షల ఎకరాల్లో సాగవ్వగా అందులో కేవలం 30శాతం పంటలకు మాత్రమే ఇ-క్రాప్ నమోదైంది. దీంతో, రైతుల్లో ఆందోళన వ్యక్తమౌతోంది. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం సాంకేతిక కారణాలను సాకుగా చూపుతున్నారు.**

ఇ -క్రాప్ బుకింగ్ ఆధారంగానే ప్రభుత్వం పంటల బీమా, సున్నావడ్డీ కల్పిస్తున్న విషయం విధితమే. ఉత్పత్తులను కొనుగోలుచేసి, వాటికి కనీస మద్ధతు ధర కల్పించేందుకు కూడా ఇ-క్రాప్‌తోనే ప్రభుత్వం ముడిపెట్టింది. ఇ-క్రాప్ కింద గుర్తింపు పొందని రైతులు, ముఖ్యంగా ధాన్యం విక్రయంలో ఎన్ని ఇబ్బందులు ఎదర్కొన్నారో రైతాంగానికి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఈనేపథ్యంలో ఇ-క్రాప్ బుకింగ్ అనేది రైతులకు అత్యంత కీలకంగా మారింది. అమలు విషయంలో లక్ష్యానికి దూరంగా ఉండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మన జిల్లాలో ఖరీఫ్ సీజన్ అత్యంత ప్రాధాన్యతగలది. ఎక్కువ భూభాగంలో వర్షాధారంగానే పంటలు సాగవుతాయి కాబట్టి రబీలో పంటల నామమాత్రమే. ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, నువ్వులు, రాగులు, చిరుధాన్యాలు తదితర పంటలు కలిపి సుమారు 4లక్షల ఎకరాల్లో సాగువుతాయి. ఇందులో అత్యధికంగా వరి 2,23,025 ఎకరాల్లో సాగవుతుంది. ఆ తరువాత స్థానంలో మొక్కజొన్న, పత్తి, చెరకుసాగు ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు 1,14,285 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా వరి 72,884 ఎకరాల్లో సాగైంది. ఇందులో ఇప్పటి వరకు కేవలం 16,832 ఎకరాలకు మాత్రమే ఇ-క్రాప్ నమోదైంది. మొక్కజొన్న 37,728 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, 19,156 ఎకరాల వరకు సాగైంది. ఇందులోనూ 1610 ఎకరాల మేర మాత్రమే ఇ-క్రాప్ బుకింగ్‌కు నోచుకుంది. పత్తిపంట విషయంలో మరీ దారుణంగా 2,938 ఎకరాలకు గాను 254 ఎకరాలను మాత్రమే గుర్తించారు. చెరకుసాగు సాగు పాత, కొత్త కలిపి 779 ఎకరాలు ఈ క్రాప్ కింద నమోదు చేశారు. నువ్వులు 2232 ఎకరాలు, రాగులు 101 ఎకరాల చొప్పున ఇ-క్రాప్ కింద చేర్చారు. ఈ నేపథ్యంలో రైతులు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తుండగా, అధికార యంత్రాంగం సాంకేతిక సమస్యల వలే ఇ-క్రాప్ నెమ్మదిగా సాగుతోందని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జులై 30 నుంచి ఇ -క్రాప్ నమోదు ప్రారంభమైంది. సెప్టెంబర్ 15లోపు పూర్తిచేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఇ-క్రాప్ నమోదులో భాగంగా సంబంధిత రైతుల ఫోటోలను పొలంలోనే తీసి అప్‌లోడ్ చేయాల్సివుంది. ఇకెవైసి కూడా తీసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు వేలాది ఆర్‌బికెలు ఇదే పనిలో వుండడం వల్ల సర్వర్ సహకరించడం లేదని ఆయా సిబ్బంది వాదన. జిల్లాలో చిన్నచిన్న భూ కమతాలు కావడం వల్ల ఉత్తరాంధ్ర మినహా ఇతర జిల్లాలతో పోలిస్తే రైతుల పరిధిలోని సర్వే నెంబర్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. మన జిల్లా పరిధిలో సుమారు 30.16లక్షల సర్వే నెంబర్లు ఉన్నట్టు సమాచారం. సర్వే నెంబర్లు ఎక్కువగా ఉండడం వల్ల ఎంట్రీలకు కూడా ఎక్కువ సమయం పడుతుందని క్షేత్ర స్థాయి సిబ్బంది చెబుతున్నారు. ఏదేమైనా పంటలన్నీ సకాలంలో ఇ-క్రాప్ బుకింగ్ కాకపోతే రైతులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేగిడి మండలం శాతాయవలసలో ఇ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

కెజిబివి విద్యార్థిని మనస్వినిని అభినందిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, డిఇఒ ప్రేమ్‌కుమార్

## కెజిబివి విద్యార్థినికి అరుదైన అవకాశం

### ఐక్యరాజ్యసమితి సదస్సులో ప్రసంగించనున్న మనస్విని

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని సామల మనస్వినికి అరుదైన అవకాశం లభించింది. అమెరికాలో నిర్వహించే ఐక్యరాజ్యసమితి సదస్సులో ఆమె పాల్గొని, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యావిధానం ద్వారా మన్యం జిల్లాలో విద్యార్థులు ఏ విధంగా లబ్ధిపొందవచ్చో ప్రసంగించనుంది. ఈ మేరకు కలెక్టరు నిశాంత్‌కుమార్ బుధవారం ఆ విద్యార్థి మనస్వినిని అభినందించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు అంతర్జాతీయ అంశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 10 మంది విద్యార్థులతో కూడిన ప్రతినిధి బృందాన్ని పంపాలని నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 105 మంది విద్యార్థులను రాత పరీక్ష కోసం గుర్తించగా, అందులో 30 మందిని వర్చువల్ స్పీకింగ్ టెస్ట్ కోసం గుర్తించి, వారిలో పది మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పది మంది విద్యార్థులను ఎంపిక చేయగా, ముఖ్యమంత్రి ప్రత్యేక సిఫార్సుతో 9వ తరగతి చదువుతున్న మనస్విని ఎంపిక చేసినట్లు వివరించారు. ఐరాస కేంద్ర కార్యాలయంలో సెప్టెంబరు 18, 19 తేదీలలో జనరల్ అసెంబ్లీ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధిపై ఉన్నత స్థాయి రాజకీయ ఫోరంలో పాల్గొంటారని, నాడు-నేడు (పాఠశాల విద్య) కార్యక్రమాలపై ప్రసంగిస్తారని తెలిపారు. సదస్సులో పాల్గొనడం ద్వారా జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డిఇఒ ప్రేమ్ కుమార్, బాలికల అభివృద్ధి అధికారి కె.రోజారమణ, ప్రిన్సిపల్ సిహెచ్. శ్రీరంజని, పిఇటి ఎన్.అరుణజ్యోతి పాల్గొన్నారు.

## టిడిపి పాలనలో అభివృద్ధి శూన్యం

### జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి పాలనలో అభివృద్ధి శూన్యమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శ్రీసూర్య రెసిడెన్సీలో బుధవారం సచివాలయ కన్వీనర్లు, వైసిపి ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనలో ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఏ రంగం చూసుకున్న అభివృద్ధి చేయలేదని విమర్శించారు. చంద్రబాబు పాలనలో సాగునీరు, విద్యారంగం, ఏరంగంలో అభివృద్ధి చేసారో చెప్పగలరా అని ప్రశ్నించారు. విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో పర్యటించిన చంద్రబాబు తప్పుడు ప్రచారం చేశారన్నారు. జిల్లాను అభివృద్ధి చేసిన ఘనత మంత్రి బొత్సకు సాధ్యమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను టిడిపి తుంగలోకి తొక్కిందన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో 98శాతం హామీలను అమలు చేశామన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు జగనన్న ఇళ్లు మంజూరు చేశామన్నారు. సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి చేసి రైతులకు సాగునీరు ఇస్తున్నామని చెప్పారు. చెరకు రైతులకు ఎన్‌సిఎస్ యాజమాన్యం చెల్లించాల్సిన బిల్లులు ఆస్తులు అమ్మి చెల్లించామన్నారు. రాష్ట్రం ఆర్థికంగా అభివద్ధి చెందితే ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.

రాజులు పదిహేనేళ్ల పాలనలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఒక బోరు వేసి ప్రచారం చేసుకునే రాజులను నమ్మవద్దని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పనాయుడు మాట్లాడుతూ రాజుల పాలనలో నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందని విమర్శించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్

**సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులకు బీమా**

సచివాలయ కన్వీనర్లు, జెసిఎస్ కన్వీనర్లు, గృహ సారధులు బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే అన్నారు. వీరికి పార్టీ తరపున ఉచితంగా బీమా చేయిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19 నుంచి షెడ్యూల్ వేసుకుని గృహ సారధులకు భీమా ఆన్లైన్ చేయాలని సచివాలయ కన్వీనర్లకు సూచించారు. 2024లో జగన్మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాన్నారు. సమావేశంలో వైసిపి పట్టణ, మండల అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, జెసిఎస్ కన్వీనర్లు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పులి అడుగుజాడలను పరిశీలిస్తున్న బీట్ అధికారి దాలినాయుడు, కొరమ సమీపంలో పులి పాదముద్రలు

## మన్యంలో పులి సంచారం

**భయాందోళన చెందుతున్న గిరిజనులు**

ప్రజాశక్తి-సీతంపేట

ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో ఏనుగులతో సతమతమవుతున్న ఆదివాసీలను మరో భయం పట్టుకుంది. బుధవారం దోనుబాయి సమీపంలో పెద్దపులి సంచరించింది. పుబ్బాడ, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం బడిగం మీదుగా కొరమ వైపు పులి వెళ్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఇప్పటికే దోనుబాయి గుగ్గిలం తోటలో పెద్దపులి అడుగు జాడలను పరిశీలించారు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు బిక్కుబిక్కుమంటున్నారు.

**భామిని :** మండలంలోని కొరమ గ్రామ సమీపంలోని క్వారీ పరిసరాలలో పులి అడుగుజాడలు స్థానికులను కలవర పెడుతున్నాయి. స్థానిక క్వారీలో ఉండే వాచ్‌మెన్ బుధవారం తెల్లవారుజామున పులి సంచరించినట్లు కనిపించిందని, భయంతో పూర్తి స్థాయిలో ఆ జంతువును పరిశీలించలేదని తెలిపాడు. అటవీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించగా పులి అడుగుజాడలుగా తెలియజేశారు. వెంటనే సమాచారాన్ని తహశీల్దార్ ఎన్.అప్పారావుకు తెలియజేయడంతో కొరమ పరిసర గ్రామాలలో టామ్ టామ్ వేసి, ప్రజలను అప్రమత్తం చేశారు. క్వారీ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు నాయుడు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 19నుంచి శ్రీలంకలోని కొలంబోలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో పోల్ వాల్ట్ విభాగంలో పాల్గొనేందుకు పున్నపురెడ్డి సన్యాసినాయుడు పయనమవుతున్నట్టు మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. బుధవారం ఆయనకు కిట్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఖరగ్ పూర్ లో జరిగిన జాతీయస్థాయి పోల్ వాల్ట్ విభాగం (35-40 వయసు గ్రూపు) పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. ప్రస్తుతం విజయనగరం ఆర్మ్‌డ్ రిజర్వులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటున్న సందర్భంగా ఎస్‌పి దీపికా పాటిల్, డిఎస్‌పి శేషాద్రి, ఆర్‌ఐలు రమణమూర్తి, గోపాలనాయుడు, ఆర్‌ఎస్‌ఐ రామకృష్ణ , సీనియర్ అథ్లెట్ ఆల్తి త్రినాధరావ అభినందనలు తెలిపారు.

## సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని ఉడా కాలనీలో ప్రజలకు సైబరు మోసాలు, చిట్టీలు, దొంగతనాలు పట్ల వన్ టౌన్ పోలీసులు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ బి.వెంకటరావు మాట్లాడుతూ మొబైల్స్‌కు వచ్చే లింకులు, కెవైసి అప్‌డేట్ పేరుతో వచ్చే మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబరు మోసాలకు పాల్పడే మోసగాళ్ళు బ్యాంకు ఖాతాల్లో ఉన్న సొమ్మును కాజేసేందుకు అనేక రకాలుగా మెసేజుఉ, వాట్సాప్ సందేశాలు, ఈ మెయిల్స్ పంపుతారని, అటువంటి వారికి ఎవ్వరూ స్పందించవద్దన్నారు. మన బ్యాంకు ఖాతాలు, ఆధార్ అప్‌డేట్ పేరుతో ఫోనులు చేసి, ఒటిపి చెప్పమని కోరుతారని, అటువంటి కాల్స్ పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కువ వడ్డీలు ఆశతో చీటీలు వేసే వారి పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇల్లు విడిచి దూర ప్రాంతాలకు వెళ్లే ముందు స్థానిక పోలీసు స్టేషనుకు ముందుగా సమాచారం అందిస్తే, ఆయా ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.ఎస్ఐ వి.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం

బాలలకు అందుబాటులో న్యాయం అనే కార్యక్రమంపై బెజ్జిపురం గ్రామానికి చెందిన యూత్‌క్లబ్ స్వచ్ఛందసంస్థ జిల్లాలోని 14 మండలాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు తెలిపారు.బాలకార్మిక నిర్మూలన, బాల్యవివాహ నిరోధం, బాలలపై లైంగిక వేధింపులు అరికట్టే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. కైలాష్ సత్యర్థి బాలల నిధి సహకారంతో ఈ కార్యక్రమాలను విజయనగరం, నెల్లిమర్ల, గుర్ల, చీపురుపల్లి, మెరకముడిదాం, బొండపల్లి, గజపతినగరం, రాజాం, తెర్లాం, రామభద్రపురం, బాడంగి, గంట్యాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మికత అంశంపై వ్యాసరచన, వక్తత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

## కలాం ఆశయాలే లీడ్ ఇండియా లక్ష్యం

### వ్యవస్థాపక అధ్యక్షులు సుదర్శన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అబ్దుల్ కలాం ఆశయాలే ఎజెండాగా లీడ్ ఇండియా సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌బి సుదర్శన్ ఆచార్య పేర్కొన్నారు. కణపాక యూత్ హాస్టల్ లో బుధవారం యువతకు లీడ్ ఇండియా ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత అన్ని రంగాలలో అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. వివరించారు. జిల్లా అధ్యక్షులు ఉమామహేష్ మాట్లాడుతూ 'నీ అభివృద్ధే దేశాభివృద్ధి' అనే నినాదంతో ఈ శిక్షణ అనంతరం నిరుద్యోగ యువతకు లీడ్ ఇండియా ట్రైనర్స్ గా గౌరవ వేతనం తో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వరరావు, ముఖ్య సలహాదారు, ఆడిటర్ బాలాజి, సమన్వయ కర్త జ్ఞానేశ్వర్ గురూజీ, యోగ గురువు శశిభూషణ్ గురూజీ, రామూర్తి, హేమసుందర్, శ్రీనివాస్, కుమార స్వామి, వింధ్య, శిక్షకులు శ్రీనివాసచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గడప గడపకూ సమస్యలపై ఆరాతీస్తూ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 50వ డివిజన్ వైఎస్సార్ నగర్ లో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని చదివి వినిపించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసు కుంటూ.. వైఎస్సార్ నగర్ లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికలలో మరో మారు వైఎస్సార్ సిపి ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, నగర్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వి రాజేష్, జోనల్ ఇన్‌ఛార్జి ముచ్చు శ్రీను యాదవ్, బండారు ఆనంద్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రహదారి విస్తరణ పనులు పరిశీలన**

నగరంలో మయూరి జంక్షన్ నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు సాధ్యమైనంతవరకు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు కోలగట్ల వీరభద్ర స్వామి ఆదేశించారు. రహదారి విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. విస్తరణ పనులను పైడితల్లమ్మ జాతర సమయానికి పూర్తిచేసి ప్రజా వినియోగం లోకి తీసుకురానున్నట్లు చెప్పారు. అలాగే పెద్ద చెరువు గట్టు అభివృద్ధి పనులను కూడా పూర్తి చేసేందుకు అధికారులకు సన్నద్ధం చేస్తున్నా మన్నారు. మయూరి జంక్షన్ ప్రాంతాన్ని ఆధునికీకరించ నున్నట్లు చెప్పారు. డిజిటల్ సిగ్నల్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారైన డబుల్ రోడ్డు విస్తరణ జరిగినట్లయితే నగరానికి కొత్త శోభ సంతరించుకోనుందని చెప్పారు. ఇప్పటికే నగరంలో అనేక ప్రధాన జంక్షన్ లను అభివృద్ధి చేశామన్నారు. ఈనెల 18న ఆర్‌అండ్‌బి జంక్షన్ నుండి పాల్ నగర్‌కు వెళ్లే రహదారి విస్తరణ పనులను కూడా ప్రారంభించ నున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జివి రంగారావు, యడ్ల రాజేష్, ఆర్‌అండ్‌బి డిఇ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

**తాగునీటి కుళాయిలు ప్రారంభం**

నగరంలోని 28వ డివిజన్ రాజీవ్ నగర్ కాలనీలో తాగునీటి కుళాయిలను కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. మేయర్ విజయలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారు నాయుడు, స్థానిక కార్పొరేటర్ జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఉపఎన్నికకు పోటాపోటీ

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని పెంట శ్రీరాంపురంలో ఈ నెల 19వ తేదీన జరగనున్న సర్పంచ్ ఉప ఎన్నికకు పోటాపోటీగా అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ఈ పోటీలో వైసిపి మద్దతుతో కరక గౌతమి, టిడిపి మద్దతుతో కలక రామయ్యమ్మ బరిలో దిగారు. మొత్తం ఓట్లు 2080 ఉన్నాయి. కుటుంబాలతో సంబంధాలు ఉండడం వల్ల ప్రచారం హోరాహోరీగా సాగుతుంది. మంచం గుర్తుపై ఓటేసి కరక గౌతమినే గెలిపించాలని, కత్తెర గుర్తుపై ఓటేసి కరక రామయ్యమ్మను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. బయట ఓటర్లను రప్పించడానికి ఇరువర్గాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. గత సర్పంచ్ చప్ప నారాయణమ్మ మృతి చెందడం వల్ల ఉప ఎన్నిక జరుగుతున్న విషయం తెలిసిందే.

గౌతమి

రామయ్యమ్మ

## పూర్ణపాడు-లాబేసు వంతెన కోసం నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-కొమరాడ

దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపడుతున్నట్లు వంతెన సాధన కమిటీ సభ్యులు వి.ఇందిర, కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం నాగావళి అవతల గ్రామాలైన కొట్టు, తొడుము, రాయపురం, తులసవలస, కెమిశీల, దిగువ గుణద, తదితర గ్రామాల్లో వంతెన సాధన కమిటీ, ఎపి రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యాన ప్రచారం చేశారు. గురువారం నుంచి చేపట్టే రిలే నిరాహార దీక్షలను మద్దతివ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఇందిర, సాంబమూర్తి మాట్లాడుతూ వంతెన పనులు ప్రారంభించి పాలకుల నిర్లక్ష్యంతో 14 ఏళ్లుగా సాగదీస్తున్నారని విమర్శించారు. తొమ్మిది పంచాయతీల గిరిజనులు మండల కేంద్రానికి రావాలంటే ప్రాణాలు ఫణంగా పెట్టాల్సిన పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తంచేశారు.

# అభివృద్ధిపై దృష్టి సారించాలి: జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి- మెరక ముడిదాం

ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ఒకరితో ఒకరు సమన్వయం చేసుకొని గ్రామాలలో అభివృద్ధిపై దృష్టి సారించాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతలన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ ముందుగా హౌసింగ్ గురించి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి పొంది ఇల్లులు కట్టుకొనే వారికి బిల్లులు ఒక్క పైసా కూడా పెండింగ్ ఉండ కూడదన్నారు. గ్రామాలలో ఎన్ఆర్‌జి అసిస్టెంట్లు కరెంటు సమస్య లేకుండా చూడటానికి సచివాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. సోమలింగా పురంలో లోవోల్టేజ్ సమస్య ఉందని, గరుగుబిల్లి, యాడికలో డామేజ్ కరెంటు పోల్స్ ఉన్నాయని ఆయా ప్రజా ప్రతినిధులు తెలుపగా వాటిని పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు ఆదేశించారు. మండలంలో అనధికార వ్యవసాయ మోటార్లు ఉన్నాయని వాటి వల్ల లోవోల్టే సమస్య వస్తుందని విద్యుత్ అధికారులు జెడ్‌పి చైర్మన్‌కు చెప్పారు. అటువంటి వాటిని వెంటనే తొలిగించాలని అవసరమైతే వారిపై పోలీస్ కేసులు పెట్టాలని తెలిపారు. ఇటువంటి వాటి వల్ల నిజమైన వ్యవసాయ రైతులకు నీరు అందుబాటులో ఉండదని చెప్పారు. ఉపాధి హామీ ద్వారా బిటి రోడ్లు, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం వేగవంతం చేయాలని, రైతులకు ఈ క్రాప్ నమోదు పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామాలలో ప్రజలు వద్దకే వైద్యం చక్క నైనదని, ఫ్యామిలీ ఫిజిషన్ వైద్యం గురించి ప్రజలకు తెలియ చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్యధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రత్నం, తహశీల్దార్ విజయ భాస్కర్, వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, ఎస్‌వి రమణరాజు, కెఎస్ఆర్కే ప్రసాద్, కోట్ల వెంకటరావు, టి. హరిబాబు, పప్పల కృష్ణమూర్తి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

## లంచాలు అడిగితే చర్యలు

### ప్రజాశక్తి వార్తకు స్పందన

**బొబ్బిలి:** డ్వాక్రా గ్రూపులకు మంజూరు చేసే బ్యాంకు లింకేజీ రుణాలు కోసం లంచాలు అడిగితే చర్యలు తీసుకుంటామని మెప్మా పీడీ సుధాకర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 14న ప్రచురితమైన రుణం కావాలంటే కమీషన్ కొట్టాల్సిందే కథనానికి ఆయన బుధవారం స్పందించారు. మెప్మాలో రుణాలు మంజూరు కోసం కమీషన్ తీసుకుంటున్నట్లు వచ్చిన కథనంపై సమగ్ర దర్యాప్తు చేశామని చెప్పారు. శ్రీలక్ష్మి గ్రూపుకు డిసిసిబి బ్యాంక్ అధికారులు, సభ్యులు బ్యాంకు ఖాతాల్లో రుణం డబ్బులు జమ చేయకుండా చేతికి ఇవ్వడంతో ఆరోపణలు వచ్చాయన్నారు. బాధితరాలు సుంకర రమణమ్మకు లోన్ సొమ్ము రూ.70వేలు ఇప్పించామని చెప్పారు. డ్వాక్రా గ్రూపులకు డబ్బులు ఇవ్వకుండా సభ్యులు బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు.

## మహాసభలు విజయవంతం చేయాలి

**రేగిడి:** మండలంలోని ఉణుకూరులో ఈనెల 17న ఉదయం 10 గంటలకు జరగనున్న సిఐటియు మండల మహాసభలు విజయవంతం చేయాలని ఆ శాఖ అధ్యక్షులు త్రినాధరావు, రవి శంకర్, పోరెడ్డి విశ్వనాథం అన్నారు. ఈ మేరకు బుధవారం ఉణుకూరులో ఆటో ప్రచార యాత్ర ప్రారంభించి అరసాడ మీదుగా జోడు బంధల సెంటర్, కందిస, తునివాడ, వెంకంపేట, ఉంగరాడ మెట్ట వరకు యాత్ర కొనసాగింది. ఈ ఆటో యాత్రకు అనూహ్య స్పందన లభించింది. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ మహాసభలు దోహదపడతాయన్నారు. ఈ మహాసభలకు రాష్ట్ర సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, విజయనగరం జిల్లా నాయకులు ఎపి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ ఫెడరేషన్ కార్యదర్శి రమణ, జిల్లా భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షులు పి శంకర్రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి కే సురేష్ రానున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు మండలంలోని భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు

## విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

**రేగిడి:** మండలం పనసలవలస గ్రామానికి చెందిన సేవా సమితి గ్రూపు సభ్యులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నలుగురు పేద విద్యార్థినిలకు బుధవారం సైకిళ్ల పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుకున్న మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాన్ని ప్రధానోపాధ్యాయురాలు బి సునీత, జిల్లా యువజన నాయకులు కడగల నాగరాజు, గ్రామ పెద్దలు బోడి నాయుడు, గోవింద రావు, నర్సు నాయుడు, శంకర రావు,పెంటం నాయుడు చేతుల మీదుగా అందజేశారు. సుమారు రూ.30 వేలతో సేవా కార్యక్రమాలు నిర్వహించిన సేవా సమితి సభ్యులు డబ్బాడ సాయి, గేదెల కిశోర్, నర్సునాయుడు, హేమంత్, రామకృష్ణ, రమేష్‌లను గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. సభ్యులు సంపాదించిన వాటిలో కొంత భాగం పేదలకు కేటాయిస్తున్నట్లు సేవా సమితి నిర్వాహకులు తెలిపారు..

## దుర్గారావు కుటుంబానికి పరామర్శ

**వంగర:** మండల కేంద్రానికి చెందిన బొత్స దుర్గారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ ఆయన కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కనగల పారినాయుడు, దేవకివాడ దుర్గప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

**శృంగవరపుకోట:** విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. బుధవారం నారాయణ పాఠశాల ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులకు ఇన్వెస్టిట్యూర్ సెర్మోనీలో భాగంగా హెడ్‌బాయ్, హెడ్ గర్ల్‌లకు బ్యాడ్జీలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పివిఎస్ఎస్ విశ్వనాథ్, ఏజీమ్ శ్రీనివాస్, డీన్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

**గంట్యాడ:** ఈ నెల 19వ తేదీన పెంట శ్రీరాంపురం గ్రామంలో జరగనున్న సర్పంచ్ ఉప ఎన్నికను ప్రశాంతంగా జరిపించుకోవాలని సిఐ టివి తిరుపతి, డిఎస్‌పి ఆర్ గోవిందరావులు అన్నారు. బుధవారం పెంట శ్రీరాంపురం గ్రామాన్ని వారు పరిశీలించారు. ఎటువంటి మనస్పర్థలు గొడవలు లేకుండా ఎవరు ఓటును వారు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పెంట శ్రీరాంపురం గ్రామానికి మంచి పేరు ఉందని ఇంతవరకు ఎటువంటి గొడవలు తమ దృష్టికి రాలేదని అందరూ ఐక్యమత్యంతో ప్రశాంతంగా ఎన్నికలను జరిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంట్యాడ ఎస్ఐ కె.కిరణ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

## జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ

**బొబ్బిలి:** అగ్ని ప్రమాదాలను జాగ్రతలతో నివారించవచ్చునని అగ్నిమాపక అధికారి ఎం.సాంబమూర్తి అన్నారు. స్థానిక ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలలో బుధవారం అగ్ని ప్రమాదాలు నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాగ్రత్తలతో అగ్నిప్రమాదాలు నివారించవచ్చునన్నారు. గ్యాస్ సిలెండర్ లీకైతే రెగ్యులేటర్ వద్ద గ్యాస్ ఆపివేయాలన్నారు. అగ్నిప్రమాదాలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కల నాటడంపై అవగాహన

**నెల్లిమర్ల:** డ్వాక్రా మహిళలలు మొక్కలు నాటడం పై అవగాహన కల్పించాలని స్టేట్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ సూచించారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్ కాంతి పథం కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన సమావేశానికి హాజరైన సభ్యులకు మొక్కలు పంపిణీ చేసి కార్యాలయం ఆవరణలో మొక్కలు కూడా నాటారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం లోపింటి సత్యనారాయణ, సిసిలు, విఓఎలు, ఎంఎస్, ఈసి మెంబెర్స్, ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ ఫెసిలిటేటర్ లెప్రసి మిషన్ టి. దీప్తి, ఎం. వంశీ పాల్గొన్నారు.

## కంటకాపల్లిలో దంత వైద్య శిబిరం

**కొత్తవలస:** కంటకాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో రౌండ్ టేబుల్ ఇండియా వికెఆర్‌టి 225 లేడీస్ సర్కిల్ ఇండియా వికెఎల్‌సి 189 ఆధ్వర్యంలో డెంటల్ మెడికల్ చెకప్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో 120 మంది విద్యార్థులకు దంతాలు చెక్ అప్ చేసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెంటల్ వైద్యులు డాక్టర్ డింపుల్ అగర్వాల్, డాక్టర్ నీరజ్ మాట్లాడుతూ విద్యార్థులు పల్ల సమస్యలు ఎదుర్కొనకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యుల పర్యవేక్షణలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వైద్యులు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం అరుణ కుమార్, రౌండ్ టేబుల్ ఇండియా ప్రతినిధులు స్వీటీ జోషి, ఆల్కా రాజ్పుట్, డాక్టర్ చార్మిల, శారదా మెటల్స్ కంపెనీ సహాయక హెచ్ఆర్ మేనేజర్ జి. శంకర్రావు, హెచ్ఆర్ ఆఫీసర్ సంతోష్ కుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారిగా మండల సర్వేయర్

**గుర్ల:** మండలలో రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందించిన మండల సర్వేయర్ బార్నల శివకు అధికారులు ఉత్తమ సేవ పురస్కారాన్ని అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయనగరంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో రెవెన్యూ అధికారులతో సహా సిబ్బంది పలువురు ప్రజా ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## కిల్తంపాలెం 9వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం

**శృంగవరపుకోట:** మండలంలోని కిల్తంపాలెం గ్రామ పంచాయతీలో 9వ వార్డుకు జరిగిన పంచాయతీ వార్డు సభ్యుని ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఈ వార్డులో వైసిపి మద్దతుదారులు మామిడి అచ్చయ్యమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అచ్చయ్యమ్మకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఐవి లక్ష్మి ధృవీకరణ పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకరి ఈశ్వరరావు, మాజీ ఎంపిపి ఒంటె అప్పారావు, పంచాయతీ కార్యదర్శి బంగారు నాయుడు, పెద్దలు సుంకరి బుల్లి, ఆడారి అప్పారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**నేరాలు ఘోరాలు**

# చీడపీడల నివారణకు కషాయం అవసరం

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రకృతి వ్యవసాయంలో చీడపీడల నివారణకు కషాయం అవసరమని సిఆర్‌పి గొంప లక్ష్మి అన్నారు. మండలంలోని దిగువ కొండపర్తి, తాటిపూడి, కె.వెలగాడ, కొండ తామరపల్లి యూనిటీ పరిధిలో ఉన్న గ్రామాలలో చీడపీడల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ చీడపీడల నివారణకు ప్రతి రైతు 10 రకాల ఆకులతో కూడిన దశపర్ని కషాయాన్ని తయారు చేసుకోవాలన్నారు. అనంతరం కషాయాన్ని మహిళా రైతులతో తయారు చేయించారు. దీని వల్ల తెగుళ్ల నివారణ అధికంగా జరుగుతుందని పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. కషాయాన్ని ప్రతి రైతు తయారు చేసుకుని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పి ఎస్ సీతారత్నం, సింహాచలం, జ్యోతి, సన్యాసినాయుడు, రైతుల పాల్గొన్నారు.

**డెంకాడ:** మండలంలోని సింగవరం ఆర్‌బికెలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర అధికారి ఆర్టిఎల్ ప్రకాష్ మాట్లాడుతూ యూరియా బదులుగా అజోల్లను వినియోగిస్తే పంట దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. కలుపు నియంత్రణ వేగవంతమవుతుందని తెలిపారు. తేమ శాతం పెరుగుతుందన్నారు. నత్రజనిని పంటకు అందిస్తుందని తెలిపారు. అజోల్ల యూరియా మధ్య వ్యత్యాసాలను వివరించారు. అనంతరం గ్రామంలో కృష్ణమ్మ, రమణ, అప్పలరాములు పొలంలో యూరియా బదులుగా అజోళ్లను పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఒ హేమ సుందర్, ఎఇఒ రామకోటి, ఎల్ సుజాత, రైతులు పాల్గొన్నారు.

# వరిసాగుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలో ఆదిత్య విద్యాలయం పాఠశాల విద్యార్థులకు బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట గ్రామానికి తీసుకెళ్లి, పొలంలో వరి పండించే విధానాన్ని రైతులతో వివరించారు. నారు వెయ్యడం నుంచి నూర్పు వేసేదాకా ఎంత శ్రమించాలో చెప్పారు. ప్రతి ధాన్యం గింజ పండించడానికి రైతులు ఎంతో శ్రమిస్తారని, అందుకే అన్నం వృథా చేయరాదని హెచ్ఎం వి అమృత, డైరెక్టర్ వి సూరిబాబు విద్యార్థులకు సూచించారు.

**వేపాడ:** మండలంలోని బొద్దాం, వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆధ్వర్యంలో జిల్లా సుస్థిర వ్యవసాయ కేంద్రం సహకారంతో బుధవారం విత్తన బంతులు తయారు చేశారు. వీటిని స్థానికంగా ఉన్న మెట్ట ప్రాంతంలోనూ, రోడ్ల పక్కన చల్లారు. ఈ కార్యక్రమం వల్ల వర్షాకాలంలో విత్తన బంతుల్లో ఉన్న జామ, చింత, నేరేడు, దురాయి వంటి మొక్కలు మొలకెత్తి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడం లోనూ జీవవైవిద్యాన్ని పెంపొందించేలా తోడ్పాటు చేస్తాయని విద్యార్థులకు తెలపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర రావు, సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

# విద్యార్థులకు పతకాల పంట

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్థానిక హైస్కూల్ విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో పతకాల పంట పండించారు. ఆజాదీకి అమృత్ మహోత్సవంలో భాగంగా హైదరాబాద్ యంగ్ యెన్వాయిస్ ఇంటర్నేషనల్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో చిత్రలేఖన ప్రదర్శన మై మదర్ ల్యాండ్ పేరుతో ఆగస్టు 15న నిర్వహించారు. ఈ ప్రదర్శనకు స్థానిక హై స్కూల్ విద్యార్థులు 28 మంది 40 చిత్రాలకు గాను ఆరు బంగారు పతకాలు, 14 జూరి అవార్డులను గెలుచుకున్నారు. బంగారు పతకాలను బి చంద్రరావ, సిహెచ్ జగదీష్, బి వాగ్దేవి, జి హేమంత్ కుమార్, ఎస్ రిషిత, ఏ భార్గవి అందుకున్నారు. జ్యూరీ ఆనర్ అవార్డులను పి.దీపిక, పి.రోహిణి, బి. శాంతకుమారి, బి. వాగ్దేవి, పి. మహేష్, యు. ధనలక్ష్మి, ఆర్. రేణుక, టి.మౌనిక, ఐ.వెంకట దివ్య, ఎస్. విషిత బి జోత్స్న, పి.శరణ్య, కె.కుసుమ, ఎస్.తేజలు గెలుపొందారు. ఇంటిలో మాణిక్యాలనీ బయటకు తీసి మెరుగు పెడుతున్న డ్రాయింగ్ మాస్టర్ ఇనపకుర్తి చిన్న సత్యనారాయణకు, ప్రధానోపాధ్యాయులు బలివాడ శంకర్రావుకు డిప్లొమా ఆఫ్ ఆనర్ సర్టిఫికెట్లను సంస్థ ప్రదానం చేసింది. అంతర్జాతీయంగా అనేక దేశాల నుండి వచ్చిన చిత్రాలను కొన్నింటిని ఎంపిక చేసి మై మదర్ ల్యాండ్ పేర సావనీరు ముద్రించింది. ఈ సావనీరులో పూసపాటిరేగ పాఠశాలకు చెందిన బి. వాగ్దేవి, బి. చంద్రరావు వేసిన చిత్రాలు ప్రచురించారన్నారు. విజేతలను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కెల్ల శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపిపి ఎం.సత్యనారాయణ రాజు, సర్పంచ్ టొంపల సీతారాం, పిఎంసిఎస్ అధ్యక్షులు మహంతి లక్ష్మణరావు, పెద్దలు అభినందించారు. మరిన్ని పతకాలు వచ్చేలా పిల్లలకి తర్ఫీదు ఇవ్వాలని డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సత్యనారాయణని కోరారు.

పతకాలు సాధించిన వారితో ఉపాధ్యాయులు

# అరాచక పాలనను అంతమొందించాలి

ప్రజాశక్తి- మెంటాడ

వైసిపి అరాచక పాలనను అంతమొందించాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని అన్నారు. బుధవారం చింతాడ వలసలో వైసిపికి చెందిన సుమారు 150 కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ దరిద్రునికి ఆకలెక్కువ అన్నట్టు 151 సీట్లు వైసిపికి రాష్ట్ర ప్రజలు ఇస్తే జనసేనకు ఉన్న ఒక్క ఎమ్మెల్యేను బెదిరించి లాక్కు పోయారని అన్నారు. మాజీ మంత్రి పడాల అరుణ మాట్లాడుతూ వైసిపి దోపిడీ ప్రభుత్వమన్నారు. కనిపించిన ప్రతి సెంటు భూమిని వైసిపి నాయకులు కబ్జా చేస్తున్నారన్నారు. రాజకీయ ప్రక్షాళన కోసం జనసేనను గెలిపించాలని కోరారు. జయతి గ్రామం వద్ద పొలాల్లో నాట్లు వేస్తున్న మహిళలతో మాట్లాడారు. ఈ సారి జగన్‌కు మాత్రం ఓటేయమని కూలీలు తెలిపారు.

**150 కుటుంబాలు చేరిక :** చింతాడవలసకు చెందిన విశ్రాంతి విఆర్ఒ చింత పైడితల్లి ఆధ్వర్యంలో వైసిపి నుంచి 140 కుటుంబాలు, టిడిపి నాయకుడు గేదెల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 10 కుటుంబాలు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. వైసిపి 1వ వార్డు మెంబరు నిమ్మాది సూర్యనారాయణ, 5వ వార్డు మెంబర్ బోను అప్పారావు, మాజీ వైస్ సర్పంచ్ పంట్ల సత్యం, స్కూల్ కమిటీ చైర్మన్ బాలి సూర్యనారాయణ వైసిపి నుంచి జనసేనలో చేరారు. వీరితోపాటు సమీప గ్రామాల నుంచి పలు కుటుంబాలు జనసేన తీర్థం పుచ్చుకున్నాయి. జనసేన నాయకులు యశస్విని, పడాల అరుణ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన సిద్ధాంతాలు నచ్చి వైసిపిని వీడి జనసేనలోకి వచ్చినట్లు విశ్రాంతి విఆర్ఒ చింత పైడితల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఆధాడ మోహనరావు, మునకాల జగన్నాథం, త్రివేది, దుర్గ, చింత శ్రీనువాసరావు, ఏం దేవుడు బాబు, పొట్టా శేఖర్, మండల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశస్విని

# జ్వర పీడితుల నమూనాలు సేకరించండి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని గుల్లపాడు గ్రామంలో మలేరియా జ్వరాలతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బాధపడగా అందులో ఈశ్వరమ్మ అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. భార్య మృతి చెందగా భర్త నాగరాజు, కుమారుడు శేఖర్ విశాఖ, రాజాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో డిఎంఅండ్‌హెచ్ఒ భాస్కరరావు బుధవారం గ్రామంలో పర్యటించారు. ఇంటింటా జ్వర పీడితుల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అసిరి నాయుడుకు సూచించారు. ఈ మేరకు బుధవారం ప్రజాశక్తిలో గుల్లపాడులో పడగ విప్పిన మలేరియా అనే కథనానికి స్పందించి జ్వరంతో మృతి చెందిన కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఇంటింటికి జ్వరాల సర్వేను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బందికు పారిశుధ్యం మెరుగు పరచాలని, దోమల నివారణకు ఫాగింగ్ యంత్రంతో పొగ, మలాథియన్ స్ప్రే చేయాలని సూచించారు. అప్రమత్తంగా ఉంటేనే జ్వరాలు నివారించవచ్చునన్నారు. వర్షాకాలం కారణంగా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరాలు వచ్చిన వెంటనే నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించి వ్యాధి నిర్ధారణ బట్టి మందులు ఇవ్వాలన్నారు. సెరిబ్రల్ జ్వరాలు అయితే తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

# వాసిరెడ్డి కృషితోనే సాగునీటి ప్రాజెక్టులు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి మాజీమంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు కృషితోనే జరిగిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మాజీమంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు 101వ జయంతి బుధవారం నిర్వహించారు. రైల్వే జంక్షన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శంబంగి మాట్లాడుతూ కృష్ణమూర్తినాయుడు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. బొబ్బిలిలో ఇరిగేషన్, విద్యుత్ శాఖ కార్యాలయాలు ఏర్పాటుకు పని చేశారన్నారు. బొబ్బిలి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు వెంగళ రాయ సాగర్ ప్రాజెక్టు నిర్మించారని చెప్పారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, కొప్పుల వెలమ సంక్షేమ సంఘం అద్యక్షులు కర్రి సత్యనారాయణ, వాసిరెడ్డి తాతజీ నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు వంగపండు శ్రీరాములు నాయుడు, కో ఆప్షన్ సభ్యుడు తెర్లీ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పిసిసి మెంబర్ ముప్వల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి, కీర్తి శేషులు వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.లక్ష్మినాయుడు, సామాజిక కార్యకర్త పల్నాటి ఈశ్వరరావు, యువజన నాయకులు మండపాక శ్రీనివాసరావు, కార్యకర్తలు షర్లా పాపారావు, కృష్ణ మోహన్ రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధ వారం నగర పంచాయతి పరిధి జరజాపు పేట1, 19, 20వార్డుల్లో నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్‌బాబు వార్డుల్లో పర్యటించి సంక్షేమ పథకాలు అమలు, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో సంక్షేమ పథకాలు పార్టీలకతతంగా అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్నా మన్నారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిసు న్నామన్నారు. మరోసారి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ ఛైర్మన్ కారుకొండ వెంకటకృష్ణారావు, కో ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబశివరావు, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నాయకులు నల్లి శ్రీను, మద్దిల వాసు, ఎంఎం నాయుడు, తుమ్ము నారాయణ మూర్తి, తుమ్ము వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

## పంట నమోదు చేయించాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని ప్రతి రైతు పంట నమోదు చేయించాలని వ్యవసాయ శాఖ ఏడి యం. శ్యాంసుందర్ అన్నారు. బుధవారం అలజంగి, కోమటిపల్లి, గోపాల్ రాయుడు పేట, సిహెచ్ బొడ్డవలస గ్రామాలలో పంట నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ సహాయకులతో చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఖరీఫ్ 2023 సంవత్సరానికి సంబంధించి పంట నమోదు కార్యక్రమం వ్యవసాయ శాఖ చేపడతుందన్నారు. దీనికి సంబంధించి ప్రతి రైతు పొలం దగ్గర జియో కోఆర్డినేటర్స్ ఆధారంగా పంట నమోదు చేయిస్తున్నామన్నారు. ప్రతి రైతు ఈ కాలం ఈ పంట కాలంలో వేసిన తమ వివిధ రకాల పంటలను రైతు భరోసా గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా పంట నమోదు విధిగా చేయించుకోవాలని రైతులకు సూచించారు.

# ఇంజినీరింగ్‌లో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- డెంకాడ

కెమికల్ ఇంజనీరింగ్‌లో మంచి ఉపాధి అవకాశాలున్నాయని షెల్ ఇంటర్నేషనల్ రిటైర్డ్ కెమికల్ ప్రాసెస్ సెఫ్టీ సలహాదారుడు ఎన్.సీతారాం అన్నారు. చింతలవలసలోని మహరాజ ఇంజనీరింగ్ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంటులో జరుగుతున్న ఎక్స్‌పర్ట్ అడ్వైజర్ లెక్చర్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల భద్రత, కెమికల్ ఇంజనీరింగ్ ప్రాముఖ్యత అనే అంశాలపై వివరించారు. పర్యావరణం, ఇంధన పొదుపు, కాలుష్య నివారణ గురించి అవగాహన కలిగించారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకోసం భద్రతను పాటించవలసిన ప్రాముఖ్యతను తెలియజేశారు. కెమికల్ ఇంజనీరింగ్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని హెచ్‌పిసిఎల్, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, ఎన్ఎఫ్‌సిఎల్, అరబిందో, రెడ్డీస్, మైలాన్, రిలయన్స్, హల్దియా రిఫైనరీ, ఎన్ఎస్‌టిఎల్, బార్క్, స్టీల్ ప్లాంట్, ఒఎన్‌జిసి, గైల్ వంటి కంపెనీలలో ఎంవిజిఆర్ విద్యార్థులు 80 శాతం మంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారని వారికి మంచి జీతాలు, మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కళాశాల డైరెక్టర్, ప్రొఫెసర్ పి.సీతారామ రాజు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి. సర్వారావు, అధ్యాపకలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాం

# ఊబిలో చిక్కుకుపోయి రెండు ఎద్దులు మృతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని కొట్టాం గ్రామాన్ని అనుకోని ఉన్న గోస్తని నదిలో బుధవారం సాయంత్రం సమయంలో ఇసుక కోసం నదిలోకి దిగిన ఎద్దుల బండికి చెందిన ఎద్దులు ప్రమాదవశాత్తు ఊబిలో చిక్కుకుని చనిపోయాయి. ఈ విషయంపై సానికులు మట్లాడుతూ గ్రామానికి చెందిన బి. అచ్చిబాబు ఎప్పటిలాగే తన ఇసుక బండితో ఇసుకను సేకరించేందుకు గ్రామంలో వున్న సంతబయలు సమీపంలోని గోస్తనీ నదిలో తన ఎద్దుల బండితో దిగాడు. అయితే ఎద్దులు బండి నదిలోకి దిగి కొద్ది దూరం వెళ్లగానే అవి ఊబిలోకి చిక్కుకుపోయాయి. దీంతో ఎద్దుల బండిపై వున్న అచ్చిబాబు కేకలు వేయడంతో స్తానికులు వచ్చేసరికే ఊబిలో చిక్కుకున్న రెండు ఎద్దులు అక్కడే మరణించాయి. వాటిని సానికులు ఒడ్డుకు చేర్చారు. చనిపోయిన తన రెండు ఎద్దులను చూసి అచ్చిబాబు తీవ్రంగా రోదించాడు. తనకు జీవనదారమైన రూ. 2లక్షలు విలువ చేసే ఎద్దులు మరణించడం చూసి రోధిస్తూ స్పృహ కోల్పోయాడు.

**పెద్ద పెద్ద గోతుల వల్లే ప్రమాదం**

గతంలో నది ప్రవహం లేనప్పుడు ఎక్కడ బడితే అక్కడ ఇసుక కొసం పెద్దగోతులు తీసి వదిలేశారు. ఈ మధ్య ఏరు రావడంతో ఎక్కడ గోతులు ఉన్నాయో రైతులకు తెలియక దిగిపోతున్నారు. దీని వల్లే ప్రమాదాలు జరిగి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. రెండు నెలల క్రితం ఈ గ్రామం సమీపంలో వున్న జామి మండలం తానవరంలో ఇదే తరహా సంఘటన జరిగింది. కొంతమంది రైతుల ఆత్యాశ ఈ సంఘటనలకు కారణం అవుతుంది. మండలంలోని గోపాలల్లి, మామిడిపల్లి, వేములాపల్లి గ్రామాలు గోస్తనీ నది తీరంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఇసుక తవ్వకం దారులు ఇసుక కోసం పెద్ద పెద్ద గొయ్యలు తీయడం పరిపాటిగా మారింది. చాలా మంది రాత్రి పది తరువాత ఇసుక తవ్వకాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఈ పెద్దపెద్ద గోతుల్లో నాటుబళ్ల యాజమానులు ఎద్దులు పడి గాయాలు పాలవుతున్నాయి. ఇటువంటి సంఘటనలు బయటకు రాకుండా ఇసుక అక్రమ రవాణా దారులు దాచేస్తుండటంతో అవి మరుగున పడుతున్నాయి. ఈ అక్రమ రవాణాను అరికట్టడంలో సంబంధిత శాఖ అధికారులు పట్టిపట్టనట్టుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

మృతి చెందిన ఎద్దులు వద్ద రోధిస్తున్న అచ్చిబాబు

## మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- బొబ్బిలి

కోమటపల్లి రైల్వే స్టేషన్ యార్డ్ సమీపంలో రైల్వే ట్రాక్ పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని రైలు పట్టాఉ దాటే సమయంలో గుద్దుకోవడం కానీ, రైలు నుంచి జారిపడిపోవడం వల్ల కానీ అతను మృతి చెంది ఉంటారని రైల్వే పోలీసులు అంచనా వేస్తున్నారు. మృతునికి సుమారు 50ఏళ్ల ఉంటాయని అతని వద్ద ఎటువంటి ఆధారాలూ లేవని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బొబ్బిలి రైల్వే అవుట్ పోస్టు ఇంచార్జ్ ఎస్. కృష్ణారావు అన్నారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో భద్రపరిచామన్నారు.

## ఎంపిడిఒ పరిశీలన

**వేపాడ:** మండలంలో బొద్దాం, రామస్వామిపేట గ్రామ సచివాల యాలను ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇకెవైసి, అమ్మఒడి, జెకెసి, ఈ సర్వీసులు, పెండింగ్ అమౌంట్‌లు, సచివాలయ సిబ్బంది రికార్డులు తనిఖీ చేశారు.

# ఓటరు జాబితా ఆన్‌లైన్ వేగవంతం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఓటర్ల జాబితా ఆన్ లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. నూకరాజు సూచించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కొత్త ఓటర్ల నమోదు, జాబితా సవరణలపై రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు చేసిన నూతన ఓటర్ల నమోదు, జాబితా సవరణలు ఆన్ లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా బూత్ స్థాయి అధికార్ల నూతన ఓటర్ల నమోదు, జాబితా సవరణలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. ఈ సమావేశంలో ఎలక్షన్ డిటి ఆర్.ఈశ్వరమ్మ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇఆర్ఒ నూకరాజు

**VIZIANAGARAM MUNICIPAL CORPORATION**

e-Proc.Short NIT No.456/11/E/TO/2023-24, Dt.16-08-2023

CC Roads, Drains etc., under GGMP Community toilets under BPS and Providing of Cantral Lighting under General funds.

| | | |
|---|---|---|
| Approx. No.of works & Est.cost | 11 Works, Rs.63.50 Lakhs. | 2 Works, Rs.74.52 Lakhs |
| Download start date & time | 17-08-2023 from 3.30 P.M. | 17-08-2023 from 3.30 P.M. |
| Download end date & time | 25-08-2023 upto 3.30 P.M. | 01-09-2023 upto 3.30 P.M. |
| Bid Submission Closing Date&Time | 25-08-2023 upto 4.00 P.M. | 01-09-2023 upto 4.00 P.M. |
| Bid opening date & time | 25-08-2023 after 4.30 P.M. | 01-09-2023 after 4.30 P.M. |

Contact Nos.9849906481, 9849908296.
Further details can be seen at www.apeprocurement.gov.in.
COMMISSIONER

మహారాజశ్రీ విజయనగరం జిల్లా జడ్జి వారి కోర్టులో
G.O.P 15/2023

Between:
Yeduvaka Ramadevi, W/o Chandra Rao, R/o Kallempudi village, Lakkavarapukota Mandal, Vizianagaram Dist. .....Petitioner
And:
Nil .....Respondents

**GENERAL NOTICE TO PUBLIC**

యిందు మూలంగా యావన్మందికి తెలియజేయునదేమనగా పై కేసులో పిటిషనరు ఆమె చెల్లెలు పిల్లలైన అడ్డూరి సాయిగణేష్, అడ్డూరి దివ్యలక్ష్మిలకు గార్డియన్‌గా నియమించమని కోరుచూ దాఖలు చేసిన కేసు తే 31-8-2023దీకి వాయిదా వున్నది. పై పిటిషన్‌లో ఎవరికైనా ఆక్షేపణలున్న ఎడల **తే 31-8-2023దీన ఉదయం 10-30 గం॥**లకు హాజరై పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని మీ మనవి దాఖలు చేసుకొనవలెను. లేనిచో సదరు పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించడమగును.

//బై కోర్టు ఆర్డర్//

**CH.V.Srinivasa Rao**
Advocate for Petitioner,
Vizianagaram,
Cell: 9705503435